

టన్ను చీనీ రూ.36,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36,500 పలికాయి.



ఆముదం.. లాభదాయకం
ఆముదం పంట సాగు లాభదాయకంగా ఉంటుందని ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి తెలిపారు.
8లో

గరిష్టం/కనిష్టం
41.1°/24.6°
జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృత మైంది. గంటకు 8 నుంచి 12 కి.మీ. వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

డ్రై ఫ్రూట్స్ అలంకరణలో నెట్టికంటుడు



గుంతకల్లు: హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి డ్రై ఫ్రూట్స్ అలంకరణలో దర్శనమిచ్చాడు. వేకువ జామునే సుప్రభాత సేవలో భాగంగా మూలవిరాట్‌కు అభిషేకం గావించారు. అనంతరం వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ (గోడంబి, ఎండు ద్రాక్ష, బాదామి, డ్రై అంజూరు)తో అలంకరించారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఉత్స వాల్లో భాగంగా సాయంత్రం ఆలయ ప్రాంగ ణంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి వేదపండితులు, అర్చకుల నేతృత్వంతో లక్ష సింధూర అర్చన చేశారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాది, ఏఈఓ మల్లికార్జున, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కే.సుగణమ్మ, ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగైదు రోజుల్లో నైరుతి!



అనంతపురం అగ్రికల్చర్: రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. గురువారం కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు నాలుగైదు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రమంతటా విస్తరించేందుకు అనుకూలమైన వాతావరణం ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం వాతావరణ బులెటిన్ విడుదల చేశారు. మరోవైపు రాగల రెండు రోజులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు ఉన్నాయన్నారు. అయితే అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కూడా కురుస్తాయని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 కిలోమీటర్ల మేర బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

జిల్లాకు 734 మెట్రిక్ టన్నుల ఎరువులు



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ కోటాలో భాగంగా గురువారం జిల్లాకు 734 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా జిల్లాకు చేరిన ఎరువులను ఆయన పరిశీలించారు. పారాదీప్ పాస్ఫేట్స్ లిమిటెడ్ (పీపీఎల్) కంపెనీకి చెందిన 220 మెట్రిక్ టన్నులు యూరియా, 245 మెట్రిక్ టన్నుల 19–19–19 రకం, 269 మెట్రిక్ టన్నుల 14–35–14 రకం కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయన్నారు. ఇండెంట్ మేరకు ఆర్బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసి మిగతావి కంపెనీ, మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

తాడిపత్రి ఆర్‌ఓగా శిరీష

అనంతపురం అర్బన్: తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)గా డిప్యూటీ కలెక్టర్ శిరీషను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఆర్‌ఓగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డి ఆరోగ్యసమస్యల కారణంగా ఎన్నికల విధులు నిర్వర్తించలేనని చేసుకున్న అభ్యర్థనను ప్రభుత్వం ఆమోదిస్తూ రెవెన్యూశాఖ కార్యదర్శి వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించింది. ఆ స్థానంలో ప్రస్తుతం ఉరవకొండ నియోజకవర్గ ఏఆర్‌ఓగా ఉన్న శిరీషను నియమించారు. శిరీష కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, రాంభూపాల్‌రెడ్డి పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్నారు. ఈ క్రమంలో శిరీషను పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ తాడిపత్రి ఆర్‌ఓగా నియమించారు.

పెరుగుతున్న ఉత్కంఠ

- జూన్ 4పై అందరి కళ్లు
- గడువు సమీపిస్తున్న కొద్దీ టెన్షన్
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నం



ఏర్పాట్లపై గురువారం జెడ్పీ సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్



కౌంటింగ్ జరగనున్న జేఎన్‌టీయూ

అనంతపురం అర్బన్: కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. ఎక్కడ చూసినా ఈ విషయంపైనే చర్చ నడుస్తోంది. ఏ గ్రామంలో చూసినా ఎన్నికల ఫలితాలే చర్చనీయాంశంగా మారాయి. ఏ ఇంట్లో చూసినా ఫలానా పార్టీ గెలుస్తుందంటూ మాట్లాడుకుంటున్నారు.

ఏర్పాట్లలో అధికారుల బిజీ..
మరోవైపు జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా ముగించడమే లక్ష్యంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రక్రియ జరగనున్న జేఎన్‌టీయూలో ఏర్పాట్లలో తలమునకలవుతున్నారు. కౌంటింగ్ నిర్వహణకు 954 మంది సిబ్బందిని, ఇతర విధులకు 400 మందిని నియమించనున్నారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 112 టేబుళ్లు, 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉరవకొండ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 18 టేబుళ్లను, మిగిలిన ఏడు నియోజకవర్గాలకు సంబంధించి నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున మొత్తం 116 ఏర్పాటు చేస్తున్నారు.

కౌంటింగ్ ప్రక్రియ సాగనుందిలా..

నియోజకవర్గం	పోలింగ్ బూత్‌లు	మొత్తం ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాయదుర్గం	296	2,27,189	14	22
ఉరవకొండ	263	1,92,441	18	15
గుంతకల్లు	276	2,03,820	14	20
తాడిపత్రి	274	2,06.701	14	20
శింగనమల	293	2,05,642	14	21
అనంతపురం	292	1,83,019	14	21
కళ్యాణదుర్గం	261	2,04,297	14	19
రాప్తాడు	281	2,13,207	14	21

ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, సూక్ష్మ పరిశీలకుడు చొప్పున 228 టేబుళ్లకు 684 మందిని నియమించారు.

ఉదయం 8 గంటలకు ప్రారంభం..
4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ (ఈటీపీబీ) ఓట్ల లెక్కింపు పూర్తి చేస్తారు. ఆ తరువాత ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లు లెక్కిస్తారు. ప్రతి నియోజకవర్గంలో ఎంపిక చేసిన ఐదు వీవీప్యాట్‌లను లెక్కించి తుది ఫలితాలు వెల్లడిస్తారు. రౌండ్ల వారీగా లెక్కించిన ఓట్ల వివరాలను సువిధ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

ఓట్ల లెక్కింపు సాగనుందిలా..
ఈవీఎం కంట్రోల్ యూనిట్‌ను స్ట్రాంగ్ రూమ్ నుంచి టేబుల్ వద్దకు తీసుకొస్తారు. సీళ్ల సక్రమంగా ఉన్నాయా లేదా అనేది కౌంటింగ్ సూపర్‌వైజర్ చెక్ చేసుకుంటారు. సక్రమంగా ఉంటే కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజల్ట్ బటన్ నొక్కుతారు. ఆ వెంటనే డిస్‌ప్లే సెక్షన్‌లో వివరాలు కనిపిస్తాయి. అనంతరం ఓట్ల లెక్కింపు చేపడతారు. డిస్‌ప్లే సెక్షన్‌లోని క్రమ సంఖ్య వారీగా ఓట్ల వివరాలను 17 సీ పార్ట్–2లో నమోదు చేస్తారు. రిజల్ట్ సెక్షన్ తెరవాల్సి వస్తే, దానిని తెరిచి లోపల స్పెషల్ అడ్రస్ ట్యాగ్ ఇన్‌టాక్ట్‌గా ఉందా లేదా చూస్తారు. రిజల్ట్ బటన్ నొక్కడానికి లేదా రిజల్ట్ సెక్షన్‌పై ఉన్న డోర్ తెరవడానికి ముందే సీళ్ల క్రమ సంఖ్య నంబర్లను 17సీ పార్ట్–1లోని 9వ భాగంలో చూపిన విధంగా ఉన్నాయా లేదా పరిశీలిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కంట్రోల్ యూనిట్‌ను కౌంటింగ్ ఏజెంట్ల చేతికి ఇవ్వరు. చేతిలో ఎత్తిపట్టుకుని చూపిస్తారు. తరువాత కంట్రోల్ యూనిట్‌లోని పవర్ బటన్ స్విచ్ ఆన్ చేస్తారు. ఆ తరువాత టోటల్ బటన్ నొక్కుతారు. డిస్‌ప్లే సెక్షన్‌లో చూపిన పోలైన మొత్తం ఓట్లతో 17సీ పార్ట్–1లో చూపిన మొత్తం ఓట్లను సరిచూసుకుంటారు. అంతా సవ్యంగా ఉందని నిర్ధారణ చేసుకున్న తరువాత రిజల్ట్ సెక్షన్‌లోకి వెళ్లి రిజల్ట్–1 బటన్ నొక్కుతారు. ఆ పోలింగ్ కేంద్రంలో పోలైన మొత్తం ఓట్ల సంఖ్య, ఆ తరువాత ఒక్కొక్క అభ్యర్థికి పోలైన ఓట్ల సమాచారం కనిపిస్తుంది. ఇదంతా కౌంటింగ్ ఏజెంట్లకు కనపడేలా చేస్తారు.17సీలోని పార్ట్–2లో అభ్యర్థుల వారీగా పోలైన ఓట్ల వివరాలను నమోదు చేస్తారు. 17సీ పార్ట్–2ను కార్బన్ పేపర్ ఉంచి రెండు డూప్లికేట్ రాస్తారు. అసలైన 17సీ పార్ట్–2ను ఆర్‌ఓకు పంపుతారు. కార్బన్ కాపీని సూపర్‌వైజర్ ఉంచుకుంటాడు. 17సీ పార్ట్–2లో వివరాల నమోదు అనంతరం కౌంటింగ్ ఏజెంట్లతో సంతకం చేయిస్తారు. అటు తరువాత రిజల్ట్ సెక్షన్‌లోని ఇన్నర్, ఔటర్ డోర్లను మూసేసి పవర్ బటన్ స్విచ్ ఆఫ్ చేస్తారు. కంట్రోల్ యూనిట్లలో ఓట్ల లెక్కింపు పూర్తవగానే, క్యారింగ్ బాక్స్‌లో ఉంచి స్ట్రాంగ్ రూమ్‌కు పంపిస్తారు.

ఏపీ ఐసెట్‌లో సత్తా

- కడపన గణేష్ కుమార్ రెడ్డికి రాష్ట్ర స్థాయి నాలుగో ర్యాంకు
- దవనబోయన వెంకటేశ్‌కు 9వ ర్యాంకు




గణేష్ కుమార్ రెడ్డి, దవనబోయన వెంకటేశ్

అనంతపురం: ఏపీ ఐసెట్‌లో జిల్లా అభ్యర్థులు సత్తా చాటారు. మొత్తం 2,400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 2,224 మంది పరీక్షకు హాజరయ్యారు. 2,114 (95.05 శాతం) మంది ఉత్తీర్ణత మార్కులు సాధించారు.
- తాడిపత్రి మండలం కోనగుంట పల్లికి చెందిన కడపన గణేష్ కుమార్ రెడ్డి 165 మార్కులతో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. జిల్లా స్థాయిలో గణేష్ కుమార్ రెడ్డి మొదటి స్థానంలో నిలిచాడు.
- అనంతపురం నగరానికి చెందిన దవనబోయన వెంకటేశ్ రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించాడు. జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. వెంకటేశ్ 161 మార్కులతో ప్రతిభ చాటాడు.
- శ్రీ సత్యసాయి జిల్లాలో మొత్తం 204 మంది దరఖాస్తు చేసుకోగా, 188 మంది పరీక్షకు హాజరయ్యారు. 179 (95.21 శాతం) మంది అర్హత సాధించారు.

ఈసెట్‌లో 89 శాతం ఉత్తీర్ణత



వేణుగోపాల్ రెడ్డి

ఏపీ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. 89 శాతం మంది అర్హత సాధించారు. మొత్తం 2,157 మంది దరఖాస్తు చేసుకోగా, 2,073 మంది పరీక్షకు హాజరయ్యారు.
- ఈఈఈ విభాగంలో శింగనమల మండలం కల్లుమడికి చెందిన కొత్తచెరువు వేణుగోపాల్ రెడ్డి 143 మార్కులతో రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి శెభాష్ అనిపించాడు.

ఎవరి లెక్కలు వారివే!

- ఆత్మవిశ్వాసంతో అధికార పార్టీ
- కాకిలెక్కల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులు



అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల గెలుపుపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు, అమలు చేసిన సంక్షేమ పథకాలే తమ గెలుపునకు బాటలు వేశాయని అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ధీమాతో ఉండగా, మరోవైపు కాకిలెక్కలు వేసుకుంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులు కాలక్షేపం చేస్తున్నారు.

పందెంరాయుళ్ల జోరు..
గెలుపోటములపై తీవ్ర ఆసక్తి పెరగడంతో పందెంరాయుళ్లు రంగంలోకి దిగారు. పెద్ద ఎత్తున పందేలు వేసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే కోట్లాది రూపాయల బెట్టింగ్‌లు జరిగినట్లు తెలిసింది! పందెం డీల్ కుదుర్చుకున్న కొందరు దస్తావేజులు రాసుకోగా, మరికొందరు మధ్యవర్తుల వద్ద డబ్బులు కలిపినట్లు సమాచారం. ఇందుకోసం కొందరు దళారీ అవతారం ఎత్తి, మధ్యవర్తిత్వం చేసిన దానికి 5 నుంచి 10 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నట్లు తెలిసింది.

కొత్త రకాల పందేలు..
ఈసారి కొత్తకొత్త కోణాల్లో పందేలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యేగా ఫలానా అభ్యర్థి గెలుస్తాడు, మెజార్టీ, ఫలానా గ్రామంలోని బూత్‌లో మెజార్టీ తమకే వస్తుంది అంటూ రకరకాలుగా పందేలు కాశారు. జిల్లాలో అనంతపురం పార్లమెంట్‌తో పాటు రాప్తాడు, తాడిపత్రి, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాలపై ఎక్కువగా బెట్టింగ్‌లు జరిగినట్లు తెలిసింది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగా మారిన హిందూపురం, కుప్పం, పిఠాపురం, మంగళగిరి స్థానాల గెలుపు, మెజార్టీపై కూడా జిల్లాలో పందేలు కాయడం విశేషం.

ఆత్మవిశ్వాసంతో అధికార పార్టీ..
గెలుపుపై అధికార పార్టీ నేతలు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకొచ్చిన సంక్షేమ విప్లవంతో ప్రతి నిరుపేద ఇంటికీ ఫలాలు అందాయి. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారు. చాలామంది టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలకూ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండికూడా చేయలేని సంక్షేమం, అభివృద్ధి వైఎస్ జగన్ పాలనలో జరిగింది. అందుకే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపుపై ధీమాగా ఉన్నారు. 160 సీట్లకు పైగా గెలుస్తామని, ఆ పార్టీ నాయకులు ధీమాగా చెబుతున్నారు. మరో పక్క ప్రతిపక్ష పార్టీ నాయకులు కాకిలెక్కలు వేసుకుంటున్నారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీనీ చంద్రబాబు అమలు చేయలేదు. పైగా ఈసారి అంతకుమించి పథకాల వరాల జల్లు కురిపించాడు. చంద్రబాబు హామీలను నమ్మిన మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు తమ పార్టీకే ఓట్లు వేసి ఉంటారని ఊహాజనిత లెక్కలు వేసుకుంటున్నారు. ఏది ఏమైనా నాలుగు రోజులు ఆగితే ఫలితాల్లో అంతా తేలనుంది.

శాంతిభద్రతల సమస్య తలెత్తనీయొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్



లా అండ్ ఆర్డర్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఓట్ల లెక్కింపు క్రమంలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్, ఎగ్జిట్ పోల్ ఫలితాల ప్రకటన క్రమంలో మరింత అప్రమత్తంగా పని చేయాలని చెప్పారు. గొడవలు, ఇబ్బందులు సృష్టించే వారిపై నిఘాకు షాడో పార్టీలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటెలిజెన్స్ ద్వారా వారి కదలికలు, నడవడికలను ముందుగానే గుర్తించాలని చెప్పారు. బైండోవర్లు, రౌడీషీటర్లపై దృష్టి పెట్టాలన్నారు. 144 సెక్షన్, 133 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బాణా సంచా అమ్మకాలు, కొనుగోలు, రవాణా, వినియోగంపై విధించిన నిషేధం పక్కాగా అమలు కావాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో శాంతిభద్రతల కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. బైండోవర్లపై రిటర్నింగ్ అధికారులు సమీక్షించాలన్నారు. పోలింగ్ రోజు, ఆ తరువాత హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

తాడిపత్రి అర్బన్: కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వర్తించాలని ఎస్పీ గౌతమిశాలి ఆదేశించారు. గురువారం తాడిపత్రి పోలీసు స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. బందోబస్తు వివరాలను డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను, పికెటింగ్‌లను తనిఖీ చేశారు. జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పోలీస్ టెంట్ హౌస్ వద్ద ఏఆర్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు బలగాలకు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ సందర్భంగా సిబ్బంది అందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి సంఘటనలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అల్లర్లను ముందే పసిగట్టి నియంత్రించాలన్నారు. అల్లర్లకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించరాదన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో డీఎస్పీలు శ్రీనివాసులు, శివభాస్కర్ రెడ్డి, శ్రీహరిరాజు, శివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కవాతును నిర్వహించారు.



తాడిపత్రిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కౌంటింగ్‌ను ప్రశాంతంగా ముగిద్దాం

- ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి

అనంతపురం అర్బన్: 'ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ క్రమంలో అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నా' అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సందేశాత్మక ప్రకటనను గురువారం విడుదల చేశారు. 'ఎన్నికల ప్రక్రియను నమ్ముదాం, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల నిర్ణయాన్ని గౌరవిద్దాం. జిల్లాకు చెందిన వివిధ రంగాల మేధావులు, వృత్తి నిపుణులు, వృద్ధులు, మహిళలు, యువతీయువకులు, ఉద్యోగులు, సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. ఇప్పటి వరకు మనమందరం కలిసి పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశాం. తదుపరి జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను కూడా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సహకరిస్తారని ఆశిస్తున్నా' అంటూ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

వైభవం.. శ్రీవారి వసంతోత్సవం

- ధ్వజ అవరోహణంతో ముగిసిన పెన్నహోబిలం నృసింహుని బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో మూలవిరాట్



వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవం, ధ్వజ అవరోహణ కార్యక్రమాలను గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాతం, మహాభిషేకం, అర్చన, ఉత్సవ నిత్యహోమం, బలిహరణ, మంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు వసంతోత్సవం కార్యక్రమాన్ని ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథ చార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ధ్వజ అవరోహణం గావించి శ్రీవారి ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్‌ఆర్ట్స్, మ్యూజిక్ పరీక్షలు జరిగాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలకు జనరల్ విద్యార్థులు 7,150 మందికి గాను 6,743 మంది హాజరయ్యారు. 407 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 457 మందికి గాను 337 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జనరల్ విద్యార్థులు 1,361 మందికి గాను 1,274 మంది హాజరయ్యారు. 87 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 124 మందికి గాను 102 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్, ఆర్ఐఓ ఎం.వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 5 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 5 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ 4 కేంద్రాలను తనిఖీలు చేశారు.

అదనపు ఏఆర్‌ఓలకు శిక్షణ ఇప్పించండి

అనంతపురం అర్బన్: కౌంటింగ్ కోసం ఎన్నికల సంఘం ప్రత్యేకంగా అదనపు ఏఆర్‌ఓలను నియమించిందని, వారికి కౌంటింగ్ విధి విధానాలపై శిక్షణ అందించాలని జెడ్పీ సీఈఓ నిదియాదేవిని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: అక్రమంగా జిల్లాలోకి తీసుకువస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... బళ్లారి జిల్లా రూపనగుడి పంచాయతీ రాయపుర గ్రామానికి చెందిన బోయ భీమన్న, బోయ ఆంజనేయ గురువారం ఉదయం కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంపై మద్యం బాక్సులు తరలిస్తూ బొల్లనగుడ్డం చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారు. విచారణలో గోవింద వాడ, కల్లుహోళ గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నట్లుగా అంగీకరించారు. వీరి నుంచి 90 ఎంఎల్ సామర్థ్యమున్న 960 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ హేమాద్రి, తదితరులు

పుట్లూరు: టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణాచారి, సుశీలమ్మ దంపతుల కుమారుడు వర్దనాచారి (19) తాడిపత్రిలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం ఉదయం తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలసి ప్రాక్టికల్స్ పరీక్షకు హాజరయ్యాడు. తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా నాగిరెడ్డిపల్లి వద్దకు చేరుకోగానే నల్లమట్టిని పొలాలకు తరలిస్తున్న టిప్పర్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వర్దనాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హేమాద్రి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందినట్లు సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అనాథ పిల్లలకు అండగా రంగయ్య

- కానరానిలోకానికి తల్లి .. కన్పించని తండ్రి
- అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులు

శెట్టూరు: తల్లి మృతితో అనాథలైన చిన్నారులకు ఎంపీ తలారి రంగయ్య అండగా నిలిచారు. ఆర్థిక సాయం అందించడంతో పాటు ముగ్గురు పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతామని భరోసానిచ్చారు. వివరాలు... శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందిన చంద్రకళ (36), తిమ్మరాజు దంపతులకు 11 ఏళ్ల వయసున్న ప్రభాని, ఏడేళ్ల వయసున్న అనుశ్రీ, ఆరు నెలల వయసున్న ఓ కుమారుడు ఉన్నారు. కారణమేదో తెలియదు కానీ తిమ్మరాజు ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పిల్లలపోషణ భారం చంద్రకళపై పడింది. మూడు రోజుల క్రితం గుండెపోటుతో చంద్రకళ మృతి చెందింది. అయిన వారు ఎవరూ లేకపోవడంతో చిన్నారులు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ తలారి రంగయ్య గురువారం ఐదుకల్లు గ్రామానికి చేరుకుని చిన్నారులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. వారికి విద్య, వైద్యం, పోషణ తదితర అంశాల్లో అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు గోళ్ల సూరి, దొణస్వామి, సోమనాథరెడ్డి, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి, స్థానిక సర్పంచ్ విరుపాక్షి గౌడ్, ఎంపీటీసీ నాగమణి, సింగిల్ విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి, మహిళ నాయకురాలు మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

కదిలిన అధికార యంత్రాంగం

ఐదుకల్లు విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు గురువారం ఆ గ్రామానికి చేరుకుని చిన్నారులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ వనజాక్షమ్మ, స్థానిక సూపర్‌వైజర్ రాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ఉన్నారు. ఆరునెలల బాలుడిని శిశుగృహలో, ఇద్దరు బాలికలను హోంలో చేర్పించి సంరక్షణ కల్పిస్తామన్నారు. విషయం తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్... రూ.10 వేల విలువ చేసే దుస్తులు, రూ.5 వేల నగదును అందజేశారు. సర్పంచ్ విరుపాక్షి రూ.10 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు.

ప్రాణం పోసిన వైద్యులు



డిశ్చార్జి చేస్తున్న రోగి అబ్దుల్లాతో వైద్య బృందం

అనంతపురం ఎడ్యుకేషన్: తీవ్ర కత్తిపోట్లకు గురై ప్రాణాపాయ స్థితిలో వచ్చిన వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్సతో అనంతపురం సర్వజన ఆస్పత్రి వైద్యులు ప్రాణం పోశారు. వివరాలు.. గుంతకల్లు ప్రాంతానికి చెందిన అబ్దుల్లాపై కత్తి దాడి జరిగింది. విషమ పరిస్థితిలో ఉన్న అతడిని ఈ నెల 18న అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు... పేగు మూడు చోట్ల తెగినట్లు, మూడు ఎముకలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. దీనికి తోడు అధిక రక్తస్రావంతో రోగి పరిస్థితి పూర్తిగా దిగజారింది. దీంతో వెంటనే ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. జనరల్ సర్జరీ హెడ్ డాక్టర్ రామస్వామినాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉజ్జునేశ్వరి, డాక్టర్ రష్మీ, డాక్టర్ రమణనాయక్, పీజీలు డాక్టర్ రమ్య, డాక్టర్ విశాల్, డాక్టర్ అభిలాష్, సీటీవీఎస్ సర్జన్ డాక్టర్ సునీల్‌కళ్యాణ్‌దేవ్, అనస్తీసియా వైద్యులు నవీన్, జ్యోత్స్న శస్త్రచికిత్స చేపట్టారు. ఆపరేషన్ అనంతరం 11 బాటిళ్ల రక్తం ఎక్కించాల్సి వచ్చింది. 12 రోజుల పాటు వారి పర్యవేక్షణలోనే ఉంచుకున్న అనంతరం రోగి కోలుకున్నట్లుగా నిర్ధారించుకుని గురువారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులకు రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణం
- విషయం తెలిసి మందలించిన తల్లిదండ్రులు
- ప్రియురాలి మృతితో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కణేకల్లు: చదువుకునే వయసులో ప్రేమ సరైంది కాదని తల్లిదండ్రులు మందలించడంతో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం బెణికల్లు గ్రామానికి చెందిన కె.వర్షిత (17) మండల కేంద్రంలోని ఓ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ చదువుతోంది. ఇటీవల రాసిన పరీక్షల్లో తాను ఆశించిన మేర మార్కులు రాకపోవడంతో ఇంప్రూవ్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకుని పరీక్షలు రాస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం ఫిజిక్స్ పరీక్ష రాసి ఇంటికెళ్లింది. అప్పటికే కొంత మంది ద్వారా కూతురి ప్రేమ వ్యవహారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మందలించారు. బుద్ధిగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని హితవు పలికారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కెమిస్ట్రీ పరీక్ష రాసేందుకు కుమార్తె సిద్ధమవుతుండగా గమనించిన తల్లిదండ్రులు ఏ పరీక్ష రాయొద్దని, కళాశాల తెరిచే వరకూ కణేకల్లుకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. దీంతో స్నానం చేసి వస్తానంటూ బాత్‌రూంకు వెళ్లిన వర్షిత.. అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతసేపటికీ ఆమె బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు బాత్‌రూం తలుపు బద్దలుకొట్టి చూశారు. అప్పటికే విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను గమనించి, విషయం పోలీసులకు తెలిస్తే పరువు పోతుందని భావించి గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనాస్థలానికెళ్లి ఆరా తీయడంతో మొత్తం విషయం వెలుగు చూసింది. ఇన్‌చార్జ్ వీఆర్వో దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, వర్షిత ఆత్మహత్య విషయం తెలియగానే కణేకల్లు కాలేజీలో ఫస్ట్ ఈయర్ చదువుతున్న ఓ విద్యార్థి సైతం యర్రగుంట వద్ద ఉదయం 11.50 గంటలకు పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. రోడ్డు పక్కన అపస్మారకస్థితిలో పడి ఉన్న విద్యార్థిని స్థానికులు గుర్తించి కణేకల్లుక్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు కుటుంబసభ్యులు బళ్లారికి తీసుకెళ్లారు.

పాము కాటుతో యువకుడి మృతి

బొమ్మనహాళ్: పాముకాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం కొలగానహళ్లికి చెందిన ప్రభాకర్ (25)కు మూడేళ్ల క్రితం కర్ణాటకలోని కంప్లికి చెందిన కవితతో వివాహమైంది. సంతానం లేదు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న ప్రభాకర్ గురువారం ఉదయం తోటి కూలీలతో కలసి దేవగిరి క్రాస్ వద్ద జొన్న సొప్పను లారీలో లోడ్ చేసే పనికి వెళ్లాడు. అప్పటికే జొన్నసొప్పలో పొంచి ఉన్న పాము కాటు వేయడంతో ప్రభాకర్‌ను వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.



ప్రభాకర్ (ఫైల్)

అందుబాటులో జీవకారక మందులు

- జీవనియంత్రణ ప్రయోగశాల ఏడీఏ బొమ్మిరెడ్డి పద్మలత

అనంతపురం అగ్రికల్చర్: సస్యరక్షణ మందులుగా జీవకారక మందులు (బయోపెస్టిసైడ్స్) వినియోగంపై దృష్టి సారించాలని వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులకు జీవనియంత్రణ ప్రయోగశాల (బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్–బీసీ ల్యాబ్) ఏడీఏ బొమ్మిరెడ్డి పద్మలత సూచించారు. అవగాహన రాహిత్యం, అధిక దిగుబడులు సాధించాలనే ఆలోచనతో ఇటీవల విచ్చలవిడిగా రసాయన, క్రిమిసంహారక మందుల వాడకం పెరిగి భూసారం పూర్తిగా తగ్గిపోయి రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. రసాయనిక మందుల వినియోగం వల్ల భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మక్రిములు, వానపాములు లాంటివి పూర్తిగా నశించిపోయినట్లు తెలిపారు. రానురాను పంట దిగుబడులు కూడా బాగా తగ్గిపోవడంతో రైతులకు పెట్టుబడులు, నష్టాలు పెరిగాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జీవకారక మందులైన ట్రైకోడెర్మావిరిడీ, సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ లాంటి వాటిని పంటల్లో విరివిగా వాడితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. జీవకారక మందులను అనంతపురంలోని జేడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న బీసీ ల్యాబ్‌లో రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కిలో ట్రైకోడెర్మావిరిడీ రూ.100, కిలో సూడోమోనాస్ రూ.150 చొప్పున రైతులకు అవసరమైనంత ఇస్తామని తెలిపారు. తక్కువ ఖర్చుతో లభించే వీటి ద్వారా వ్యవసాయ, ఉద్యాన, కూరగాయల పంటల సాగులో విత్తనశుద్ధి (సీడ్ ట్రీట్‌మెంట్), అలాగే వివిధ రకాల చీడపీడలు, తెగుళ్ల నివారణలో సస్యరక్షణ మందుగా వాడితే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ప్రధానంగా వివిధ పంటలపై ఆశించే కాయకుళ్లు, మొదలుకుళ్లు, మాగుడు తెగులు, వేరుకుళ్లు, కాండం కుళ్లు, ఎండుతెగులు, పసుపు కొమ్మ కుళ్లు, తెగుళ్లను నియంత్రించవచ్చన్నారు. వేరుశనగ పంటలో ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి ద్వారా వేరుకుళ్లు, పప్పుశనగలో ఎండు తెగుళ్లు, వెలువ్వకుళ్లను సమర్థవంతంగా అడ్డుకోవచ్చునన్నారు. అలాగే మిరపలో వేరుకుళ్లు, టమాటలో కాండం కుళ్లు, దానిమ్మలో ఎండు కుళ్లు, పుచ్చకాయలో వేరుకుళ్లు, కనకాంబరము, లిల్లీలో వేరుకుళ్లు సమర్థవంతంగా నివారించుకోవచ్చని తెలిపారు. ఉద్యాన పంటల రైతులు రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి బయట వివిధ రకాల రసాయన, క్రిమిసంహారక మందులు వాడటం కన్నా ఈ మందులు వాడితే పెట్టుబడులు తగ్గి దిగుబడులు బాగా పెరుగుతాయన్నారు. ఆర్‌బీకే అసిస్టెంట్లు, వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి, మండల స్థాయి అధికారులు వీటిపై రైతుల్లో అవగాహన పెంచితే చాలా వరకు మేలు జరుగుతుందన్నారు.





ల్యాబ్‌లో తయారు చేసిన ట్రైకోడెర్మావిరిడీ, సూడోమోనాస్ ఫ్లోరోసెస్ (ఇన్‌సెట్‌లో) ఏడీఏ బొమ్మిరెడ్డి పద్మలత

వ్యక్తి బలవన్మరణం

- మృతుడు 104 వాహన డ్రైవర్

ఆత్మకూరు: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరానికి చెందిన ముస్తఫా (55) పదేళ్లుగా ఆత్మకూరులో 104 వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యం కారణంగా దాదాపు నెల రోజులకు పైగా సెలవు తీసుకున్నాడు. నాలుగు రోజుల క్రితం విధులకు హాజరయ్యాడు. విధుల్లో భాగంగా గురువారం ఉదయం వైద్య సిబ్బందితో కలసి 104 వాహనంలో ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చేరుకున్నాడు. గ్రామస్తులకు వైద్య సేవలు అందించడంలో సిబ్బంది నిమగ్నమైన సమయంలో ఆ పక్కనే ఉన్న ఆర్డీటీ పాఠశాల ఆవరణలోకి చేరుకున్న ముస్తఫా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం భోజన సమయంలో ముస్తఫా కోసం సిబ్బంది గాలించారు. ఆ సమయంలో ఉరికి విగతజీవిగా వేలాడుతున్న ముస్తఫాను గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించారు. వ్యక్తిగత కారణాలతోనే ఆయన ఆత్మహత్య చేసుకుని ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా, ముస్తఫాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం చేసినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



ముస్తఫా మృతదేహం

సాక్షి క్లాసిఫైడ్స్

సమాజాన్ని ప్రభావితం చేయడం కొందరికే సాధ్యం

- సుందరరాజు జయంతి సభలో ఆచార్య బాలసుబ్రహ్మణ్యం

అనంతపురం / కల్చరల్: సాహిత్యాన్ని, సమాజాన్ని తనదైన విలక్షణ వ్యక్తిత్వంతో ప్రభావితం చేసిన అరుదైన వ్యక్తి నాగప్పగారి సుందరరాజు అని ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఎస్కే యూనివర్సిటీలో సుందరరాజు 56వ జయంతిని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సమావేశానికి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, డాక్టర్ జెన్నే ఆనంద్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై, మాట్లాడారు. సుందరరాజు తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకుని కవిగా, కథకుడిగా, పరిశోధకుడిగా, విద్యార్థి ఉద్యమ నాయకుడిగా విలక్షణ పాత్ర పోషించారని గుర్తు చేశారు. జీవించిన తక్కువ కాలంలోనే సమాజంలోని అనేక రుగ్మతలను, అణచివేత ధోరణులను తానెంచుకున్న సాహిత్యం ద్వారా నిరసిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసి యువకవిగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, ఎస్సీఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్, రచయిత్రి అరుణ, రేపల్లె రాముడు, నాగేంద్ర, ఆనంద్, జిల్లా నాయకులు బాలకృష్ణ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

ట్రాక్టర్ బోల్తా - ఒకరి మృతి

రాయదుర్గం టౌన్: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భైరవానితిప్ప గ్రామానికి చెందిన వీరేష్ (30)కు భార్య, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే వీరేష్... అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ క్యాతప్పతో కలసి గురువారం ఉదయం విద్యుత్ స్తంభాలను తీసుకెళ్లేందుకు రాయదుర్గం వచ్చాడు. విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లో లోడు చేసుకుని తిరుగు ప్రయాణంలో గుమ్మఘట్ట మండలం పూలకుంట వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. విద్యుత్ స్తంభాలు మీదపడడంతో వాటి మధ్య ఇద్దరూ ఇరుక్కుపోయారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను కాపాడి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారి విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించి వీరేష్ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



మృతుడు వీరేష్

పామిడి సీహెచ్‌సీలో అరుదైన ఆపరేషన్

పామిడి: అరుదైన ఓంఫాలిటిస్ అనే జబ్బుతో బాధ పడుతున్న ఓ రోగికి పామిడి సీహెచ్‌సీ వైద్యాధికారులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. పామిడి కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం ఎన్‌ఎన్‌పీ తండాకు చెందిన గోవిందనాయక్ కొంతకాలంగా ఇన్ఫెక్టెడ్ పేటెంట్ యురాకస్ ఓంఫాలిటిస్ అనే జబ్బుతో బాధపడుతున్నాడు. వివిధ ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ క్రమంలో జబ్బు మరింత ముదిరింది. సాధారణంగా ఓంఫాలిటిస్ అనేది నాభి, లేదా నాభి చుట్టుపక్కల ఉన్న కణజాలానికి సోకే ఇన్ఫెక్షన్ అని, దైహిక సంక్రమణమైన ఈ వ్యాధికి వెంటనే శస్త్రచికిత్స చేయకపోతే శరవేగంగా విస్తరించి మరణానికి దారి తీస్తుందని డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి వివరించారు. ఈ క్రమంలో చికిత్స కోసం సీహెచ్‌సీకి వచ్చిన గోవిందనాయక్ పరిస్థితిని గమనించి వెంటనే సర్జరీకి ఏర్పాట్లు చేశామన్నారు. అనస్తియా వైద్యుడు రాఘవేంద్రరెడ్డి పర్యవేక్షణలో జనరల్ సర్జన్ డాక్టర్ కమలాకర్ సహకారంతో బుధవారం రాత్రి 11.30 గంటలకు పామిడి సీహెచ్‌సీలోనే ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. గురువారం ఉదయం రోగి పరిస్థితి కుదటపడి క్రమంగా కోలుకుంటున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్సలో హెడ్ నర్సు శివకుమారి, నర్సు కవిత పాల్గొన్నారన్నారు.



పామిడి సీహెచ్‌సీలో ఆపరేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

విశ్వాసంతో సమస్తమూ సాధ్యమే





సువార్త సభలకు హాజరైన భక్తులు, ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ అద్భుతకుమార్

- బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్
- రెండో రోజు కొనసాగిన మహిమ సువార్త సభలు

గుత్తి: విశ్వాసంతో ప్రార్థిస్తే సర్వాధిపతియైన యేసు సమస్తమూ అందిస్తారని, నమ్మి ప్రార్థించే వారి వెంట క్రీస్తు తప్పక ఉంటారని బైబిల్ మిషన్ చర్చి(స్వస్థత శాల) పాస్టర్లు రెవరెండ్ అద్భుత కుమార్, మణికుమారి అన్నారు. గుత్తి బైబిల్ మిషన్ చర్చిలో జరుగుతున్న మహిమ సువార్త మహాసభలు రెండో రోజు గురువారమూ కొనసాగాయి. దేశవిదేశాలకు చెందిన ప్రముఖ పాస్టర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అద్భుత కుమార్, మణికుమారి వాక్యోపదేశం చేశారు. ప్రతి ఒక్కరూ క్రీస్తుపై విశ్వాసం, నమ్మకం ఉంచాలన్నారు. క్రీస్తు బాటలో నడిచేవారికి అంతా మేలే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్ చర్చి సభ్యులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శయనోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంటకరమణుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం రాత్రి ఆలయంలో శయనోత్సవం, సప్తప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, అలంకరణ పెద్ద ఎత్తున జరిగాయి. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రజలకు, కులసంఘాల వారికి, దాతలకు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



శయనోత్సవంలో ఉత్సవ మూర్తులు

'ఆముదం'... లాభదాయకం

- వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి

బుక్కరాయసముద్రం: ఆముదం పంట సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి సూచించారు. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం, అఖిల భారత నూనె గింజల పరిశోధన సంస్థ హైదరాబాద్ సంయుక్తంగా గురువారం ఆముదం మేళా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆముదం పంట సాగుపై రైతులకు శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఆముదం పంట సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. ఆముదం పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఐసీహెచ్–5 ఐసీహెచ్–66 ఆముద విత్తనాలను రేకులకుంట పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉంచామన్నారు. రెండు కిలోల విత్తనం రూ.850 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆముదం పంట సాగులో తెగుళ్లు, యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ లావణ్య, డాక్టర్ సురేష్, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ జవహర్‌లాల్, రేకులకుంట శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



ఆముదం మేళాలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

రైలు నుంచి జారి పడి కర్నూలు జిల్లా వాసి మృతి

అనంతపురం సిటీ: బతుకు తెరువు కోసం బెంగళూరుకు వెళ్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతిచెందాడు. మృతుడిని కర్నూలు జిల్లా హోళగుంద మండలం నాగరకన్వి గ్రామానికి చెందిన హరిజన నాగప్ప కుమారుడు సురేష్ (20)గా గుర్తించినట్లు అనంతపురం జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. తండ్రి పదేళ్ల క్రితమే చనిపోవడంతో తల్లి, ఇద్దరు తమ్ముళ్ల పోషణ భారం పెద్ద కుమారుడు సురేష్‌పై పడింది. ఇంటర్ వరకు చదువుకున్న సురేష్.. బెంగళూరుకు వెళ్లి ఏదైనా కంపెనీలో కార్మికుడిగా చేరాలనే ఆకాంక్షతో తన స్నేహితుడితో కలసి వెళ్లాడు. గురువారం ఉదయం హంపి ఎక్స్‌ప్రెస్ రైలులోని జనరల్ బోగీలో తిరుగు ప్రయాణమయ్యాడు. రైలు అనంతపురం రామ్‌నగర్ వద్దకు చేరుకోగానే డోర్ వద్ద నిలబడిన సురేష్ అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కీమెన్ గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి సురేష్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



సురేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు


సర్వే చేస్తున్న ఐఈఆర్‌టీ సిబ్బంది

ఆత్మకూరు: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ప్రత్యేక అవసరాల గల పిల్లల గుర్తింపునకు గురువారం సర్వే చేపట్టారు. ఈనెల 3వ తేదీ నుంచి మండలంలో ఈ సర్వే నిర్వహించినట్లు ఐఈఆర్‌టీ అధికారిణి అరుణ తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 29 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల్ని గుర్తించడం జరిగిందన్నారు. వీరికి ఫిజియోథెరపీ, ఉచితంగా విద్యా బోధన, యోగా, శారీరక కదలికలు వంటి ఆసనాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు.

సాయినాథుడికి అభిషేకం


నదీజలాలతో సాయినాథుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: ఈనెల ఆరంభంలో ఘనంగా సాగిన నర్మదా పుష్కరాల పవిత్ర నదీ జలాలతో గురువారం నగరంలోని తపోవనం శివశక్తి సాయిబాబాకు అభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాత హారతి, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, మహా అలంకార సేవలు, మహాశివుడికి రుద్రాభిషేకం జరిగాయి. ఈ సందర్భంగా బాబాకు నివేదించిన పుష్కర జలాలను సాయిట్రస్టు వారు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఆవరణలో ఉద్రిక్తత

అనంతపురం సిటీ: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కొందరు వ్యక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈలలు, కేకలు, బండబూతులు తిట్టుకుంటూ హంగామా చేశారు. అందరూ ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారు. జెడ్పీ కాంపౌండ్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు ఏం జరుగుతోందో అర్థం కాక ఆందోళనకు గురయ్యారు. అయితే ఓ జెడ్పీ ఉద్యోగి జోక్యం చేసుకొని ×ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో వారంతా అక్కడి నుంచి జారుకున్నారు. అయితే వారు ఎవరు? ఎందుకు కొట్టుకున్నారనే వివరాలు తెలియరాలేదు. పోలింగ్ సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇటువంటి గొడవలకు ఆస్కారం లేకుండా జెడ్పీ, పోలీస్ అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్


సుబ్బరాయునిపల్లిలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గురువారం క్షయ వ్యాధి నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టారు. ఎన్ఎస్ గేట్ డాక్టర్లు ఉదయ్, రవి నాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ప్రతి గురువారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సిబ్బంది ఈ టీకాలను వేస్తారని డాక్టర్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా క్షయ వ్యాధిపై ఉన్న అపోహలు వాటి నివారణ చర్యలు, క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. క్షయ వ్యాధి నివారణకు బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, వెంకటనారాయణ, సీహెచ్‌ఓ గోవిందమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అక్క దేవతల ఉత్సవాలు


కుంకాలు ఆడుతున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్క దేవతల ఉత్సవాలు ముగిశాయి. గత వారం రోజులుగా అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను ప్రజలు నిర్వహించారు. గురువారం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుంకాలు ఆడుతూ ఆనందంగా గడిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మునీర్ అహమ్మద్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిర్వి'రామ' భజన

• హనుమజ్జయంతి ప్రారంభం

భక్తిభావాన్ని పెంచే హనుమజ్జయంతి గురువారం ఘనంగా ప్రారంభమైంది. హనుమ నామ స్మరణతో ఆలయాలు పులకించాయి. మూడు రోజుల పాటూ సాగే ఉత్సవాల్లో తొలిరోజు హౌసింగ్ బోర్డులోని నిలువెత్తు భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ధర్మధ్వజాన్ని ప్రతిష్ఠించారు. ధ్వజారోహణం, గోమహాలక్ష్మి పూజలతో వేడుకలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. భక్తాంజనేయుడికి చందన అలంకారం, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పూజలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భజన బృందాలు 24 గంటల పాటూ శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ రామనామస్మరణతో ఆలయాన్ని మార్మోగించారు. ఈ విజయతారక మంత్రం శుక్రవారం ఉదయం వరకు నిర్విరామంగా సాగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకుడు పరుచూరు రమేష్ తెలిపారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు. – అనంతపురం కల్చరల్:


అలంకరణలో సీతారామలక్ష్మణులు


అఖండ రామభజన చేస్తున్న భక్తులు


పూజలందుకున్న భక్తాంజనేయుడు


అలంకరణలో శివుడి విగ్రహం

పరిటాల సునీత కనుసన్నల్లోనే బైండోవర్లు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత కనుసన్నల్లోనే బైండోవర్లు చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం మండలాల పార్టీ కన్వీనర్లు లక్ష్మీనరసింహులు, జూటూరు శేఖర్, గోవిందరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, ఆత్మకూరు మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బండి పవన్ మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో ఏ ఒక్క గొడవ జరగలేదన్నారు. ఒకచోటా రీపోలింగ్ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో ఎక్కడా ఫ్యాక్షన్ హత్య కాని, గొడవలు కాని జరగలేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఏకంగా 2,500 మందిని బైండోవర్ చేశారని వాపోయారు.

ఓడిపోగానే పారిపోయిన పరిటాల కుటుంబం

2019 ఎన్నికల్లో ఓడిపోగానే పరిటాల కుటుంబం నియోజకవర్గాన్ని వదిలిపెట్టి పారిపోయిదన్నారు. పరిటాల సునీత ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెచ్చి బైండోవర్ చేయిస్తోందన్నారు. ఒక్కో పంచాయతీలో దాదాపు 25 మందిని బైండోవర్ చేశారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో పరిటాల సునీత చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా కొత్త సంస్కృతి తీసుకొచ్చారని తెలిపారు. పరిటాల సునీత ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాయడం, ఈసీ నుంచి పోలీస్ అధికారులకు ఆదేశాలు రావడంతో కేసులు కట్టడం, బైండోవర్ చేస్తున్నారన్నారు. అనవసరమైన ప్రత్యేక పరిస్థితిని సృష్టిస్తున్నారు. తాడిపత్రిలో గొడవలు జరిగితే చర్యలు తీసుకోవడంలో విఫలమైన యంత్రాంగం ప్రశాంతమైన ప్రాంతంలో రచ్చ చేస్తున్నారని ఆరోపించారు.

పోలింగ్ సమయంలో హోంగార్డులతో భద్రత..

గతంలో ఫ్యాక్షన్ ముద్ర వేసుకున్న నసనకోట, తగరకుంట, ముత్తవకుంట్ల, మద్దెలచెరువు, ఎలకుంట్లతో పాటు కనగానపల్లి, రామగిరి మండలాల్లోని అనేక గ్రామాల్లో కేవలం హోంగార్డులతో ఎన్నికలు జరిపారన్నారు. అయితే ఎప్పుడూ లేనివిధంగా తోపుదుర్తి గ్రామంలో మాత్రం ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పాటు 80 మంది పోలీసులను పెట్టారన్నారు. ఈ గ్రామంలో కొందరిని జిల్లా బహిష్కరణకు చేయాలని ప్రతిపాదనలు పెడుతున్నారన్నారు. నియోజకవర్గంపై తమ ఫ్యాక్షన్ ముద్ర వేసేందుకు పరిటాల సునీత ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రచారాలకు వెళ్లినప్పుడు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, వర్గాలు చేయడం తప్ప అభివృద్ధి గురించి కాని, తాము చేసిన మేలు గురించి కాని మాట్లాడలేదన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఎక్కడా చిన్న గొడవ లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగించామన్నారు. ఎన్నికల ముగిసిన తర్వాత కౌంటింగ్ సందర్భంగా గొడవలు జరుగుతాయనేది హాస్యాస్పదంగా ఉందన్నారు. పోలింగ్‌కు లేని బైండోవర్లు ఇప్పుడు పెడుతున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆత్మకూరు చంద్రశేఖర్ రెడ్డి, బాలపోతన్న, అనంతపురం రూరల్ మండలం వడ్డే శ్రీనివాసులు, అక్కంపల్లి మాధవరెడ్డి, ఆత్మకూరు వైస్ ఎంపీపీ విజయ్, కట్టకిందపల్లి వరప్రసాద్‌రెడ్డి, పాపంపల్లి వాసుదేవరెడ్డి, మేడాపరం మనేరు నరసింహులు, పాపంపేట ఈశ్వరయ్య, కొడిమి తిరుపాల్‌రెడ్డి, రామగిరి మండల ఎన్నికల ఇన్‌చార్జ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగిరి సీఐ శివాంజనేయులు, కనగానపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కౌటింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ.. ఎన్నికల కౌటింగ్ సందర్భంగా అన్నిచోట్లా 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉంటుందన్నారు. మండలంలో ఎక్కడా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి వీలు లేదన్నారు. ఎన్నికల్లో గెలిచిన పార్టీల వారు ఊరేగింపులు చేయడం, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. సోషల్ మీడియాలో కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకోరాదన్నారు. ఇక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా మండల కేంద్రంతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో సాయుధబలగాలు మోహరించి ఉంటాయన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనదారులకు సూచనలిస్తున్న పోలీసులు


ఆటోను తనిఖీ చేస్తున్న దృశ్యం

• విస్తృతంగా తనిఖీలు

జూన్ 4వ తేదీ.. ఓట్ల లెక్కింపునకు 22 రోజులుగా నెలకొన్న ఉత్కంఠతకు తెరపడనున్న రోజు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం తేలిపోతుంది. సార్వత్రిక ఎన్నికల్లో తుది ఘట్టం ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో నిర్వహిస్తారు. 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఈ నేపథ్యంలో గురువారం జేఎన్‌టీయూ కాలేజీలో ఎన్నికల స్ట్రాంగ్ రూములు ఉండటంతో లోపలకు వెళ్లే ఉద్యోగులు, వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.


కారు డిక్కీని తెరిచి పరిశీలిస్తున్న సిబ్బంది

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం:

ఘనంగా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరు బంగారు అంగళ్ల వీధిలో వెలసిన బంగారు యల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరబాబు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించారు. విశేష పూజోత్సవాలు చేపట్టారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన పూజలను అర్చకుడు సర్వేశ్వరాచారి సంప్రదాయరీతిలో జరిపించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. సాయంత్రం వరకు భక్తజనం బారులు తీరి అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన జరిగింది. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఆలయం దినదినాభివృద్ధి జరుగుతుండడం సంతోషకరమన్నారు. ఈ ఏడాది 8వ వార్షికోత్సవ వేడుకలను అందరూ కలసి నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కిశోర్‌కుమార్, చంద్రశేఖరగుప్తా, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో 'ఎల్లమ్మ దేవత

వైభవంగా కల్యాణోత్సవం


అలంకరణలో భావనా రుషీశ్వరులు

తాడిపత్రి అర్బన్: స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో గురువారం భావనా రుషీశ్వర స్వామి కల్యాణోత్సవం వైభంగా నిర్వహించారు. బహుత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గద్దం గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి పద్మశాలీయులందరూ పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయాన్నే సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు భక్తుల సమక్షంలో స్వామి కల్యాణోత్సవాన్ని వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ వీధుల్లో భక్తుల నడుమ స్వామి ప్రాకారోత్సవం నిర్వహించారు.

వెబ్ కౌన్సెలింగ్‌లో మార్పులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటో నగర్ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణలో స్వల్ప మార్పులు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ శైలేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 2 వరకూ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందన్నారు. అయితే 3వ తేదీ చేయాల్సిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం 6వ తేదీకి మార్పు చేశామన్నారు. అలాగే మే 31 నుంచి ప్రారంభం కావాల్సిన ఆప్షన్స్ నమోదు కార్యక్రమం జూన్ 7 నుంచి 10వ తేదీ వరకూ ఉంటుందన్నారు. 13న ఫలితాలు వెలువడుతాయన్నారు. 14వ తేదీ నుంచి కళాశాలలో క్లాసులు ప్రారంభమవుతాయన్నారు.

ఫారంపాండ్లతో భూగర్భ జలాల పెంపు

కూడేరు: ఫారంపాండ్లతో భూగర్భ జలాలు పెరుగుతాయని ఏపీఓ తులసీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని ఇప్పేరు, అంతరగంగ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న ఫారంపాండ్లు, చెక్ డ్యాంల్లో పూడిక తీత పనులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు పనులను నాణ్యతగా చేపడితే దిన కూలి రూ.300 వర్తిస్తుందన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న అబ్దుల్

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసముండే అబ్దుల్ అనే యువకుడు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీటీ సెట్‌లో 25 మంది ప్రతిభ

యాడికి: ఆర్టీటీ సెట్ పరీక్షల్లో 25 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తాడిపత్రి ఏరియా కో ఆర్డినేటర్ లలిత గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో 500 మార్కులుపైగా సాధించిన తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి మండలాల నుంచి 203 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 25 మంది ప్రతిభ చాటారన్నారు. వారిలో యాడికి మండల కేంద్రంలో ఐదుగురు, చందనలో ఒకరు, రాయల చెరువులో ఇద్దరు, కమలపాడులో ఒకరు, తాడిపత్రి, పెద్దపప్పూరులో మరికొందరు విద్యార్థులు ఆర్టీటీ సెట్‌కు ఎంపికయ్యారన్నారు. వీరిని ఆర్టీటీ చదివిస్తుందన్నారు.

చెన్నేకొత్తపల్లికి చేరిన అహింస సంస్కార్ పాదయాత్ర

చెన్నేకొత్తపల్లి: జైన మత గురువు ప్రసన్న సాగర్‌తో పాటు మరి కొందరు చేపట్టిన అహింస సంస్కార్ పాదయాత్ర గురువారం చెన్నేకొత్తపల్లికి చేరుకుంది. వీరికి స్థానిక మోడల్ స్కూల్‌లో విడిది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాదయాత్రలోని బృందం సభ్యుడు మాట్లాడుతూ.. ఏడాదిలో నాలుగు నెలలు మినహా మిగిలిన ఎనిమిది నెలలు ఈ పాదయాత్ర చేస్తూనే ఉంటామన్నారు. చతుర్మాసంలో వర్షాలు కురుస్తూ ఉంటాయని దీంతో ఈ నాలుగు నెలలు పాదయాత్రకు విరామం ఉంటుందన్నారు. రోజూ పది కిలోమీటర్లు మాత్రమే పాదయాత్ర సాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు లక్ష కిలోమీటర్ల వరకు పాదయాత్ర సాగిందని.. ఈ పాదయాత్రకు విరామం లేదన్నారు. ఇతరుల పట్ల ప్రేమానురాగాలను కలిగి ఉండటం, జీవహింస చేయొద్దని భక్తులకు వివరిస్తూ ఈ పాదయాత్ర సాగుతుందన్నారు. రోజుకు ఒకసారి మాత్రమే గురువు ఆహారం తీసుకుంటారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఈ పాదయాత్ర యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..


పుస్తకాలను ప్రాథమిక పాఠశాలలో భద్రపరిచిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: వేసవి సెలవులు ముగిసిన అనంతరం జూన్ నెలలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితం పాఠ్యపుస్తకాలను అందజేస్తోంది. ఇందులో భాగంగా చెన్నేకొత్తపల్లి మండలానికి రెండవ విడతలో 15,009 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసన్నకుమార్ నాయుడు గురువారం తెలిపారు. 8, 9, 10వ తరగతులకు సంబంధించి అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ పుస్తకాలను ప్రాథమిక పాఠశాలలో భద్రపరిచామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది శివారెడ్డి, రామసుబ్బారెడ్డి, కేశవ, శివయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం రూరల్: పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు జూన్ 2వ తేదీన ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వాల్మీకి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు అక్కులప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. రుద్రంపేట బైపాస్ పరిధిలోని వాల్మీకి కళ్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుందన్నారు. పురస్కారాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440774519, 8309090406 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న వేరుశనగ పంపిణీ


ముక్తాపురంలో వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న వీఏఏ రుక్మిణి

కనగానపల్లి: సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల పంపిణీ మండలంలోని అన్ని ఆర్బీకేల్లో కొనసాగుతున్నట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. రెండవ రోజు గురువారం కనగానపల్లితో పాటు ముక్తాపురం, తగరకుంట గ్రామాల్లో 530 మంది రైతులకు సుమారు 465 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు స్థానిక వ్యవసాయ సిబ్బంది తెలిపారు. విత్తన కాయలు అవసరమైన రైతులు స్థానిక ఆర్‌బీకేల వద్దకు వెళ్లి త్వరగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వీఏఏలు, వీఎస్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.